



# తెలంగాణ | سُرکشہ | తెలుగు
# సురక్ష
పోలీసు తెలుగు దినపత్రిక

హైదరాబాద్

శనివారం
04 ఏప్రిల్ 2026

సంపుటి : 01, సంచిక : 156
పేజీలు : 4, వెల : 5.00





### ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్ లో తెలంగాణకు ఓవరాల్ ఛాంపియన్ షిప్

# ముచ్చటగా మూడోసారి

**డిజిపి బి.శివధర్ రెడ్డిని మరియు విజేతలను అభినందించిన సీఎం ఏ.రేవంత్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్**





*(చేపూరి శ్రీనివాస రావు, సిపిఆర్ఓ, డిజిపి కార్యాలయం)*

జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు మరోసారి సత్తా చాటారు. అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో వరుసగా మూడోసారి 'ఓవరాల్ ఛాంపియన్' ట్రోఫీని కైవసం చేసుకుని అరుదైన హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన 69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసు బృందం అద్భుత ప్రదర్శన కనబరిచి అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఘనతపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ లు హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డిని, సిఐడి అడిషనల్ డిజిపి చారుసిన్హా ను, విజేతలను ప్రశంసించారు.

**ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి మాట్లాడుతూ....**

అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీస్ విభాగం సరికొత్త చరిత్ర సృష్టించిందనీ, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన 69వ జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్ర పోలీస్ బృందం, వరుసగా మూడో ఏడాది 'ఓవరాల్ ఛాంపియన్' ట్రోఫీని కైవసం చేసుకుని హ్యాట్రిక్ సాధించిందన్నారు. ఈ సందర్భంగా విజేతలను, వారికి శిక్షణ నిచ్చిన అధికారులను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర పోలీస్ విభాగం సాధించిన ఈ ఘనత తెలంగాణ కీర్తికిరీటంలో మరో మైలురాయిగా నిలుస్తుందని, అధికారుల అంకితభావం, క్రమశిక్షణే ఈ విజయానికి పునాదులని ఆయన ప్రశంసించారు. సిఐడి విభాగం ప్రత్యక్ష పర్యవేక్షణలో, నిరంతర శిక్షణతో రాటుదేలిన రాష్ట్ర బృందాలు ఈ పోటీల్లో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టాయి. 2023-24లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో, 2024-25లో జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన పోటీల్లోనూ విజేతగా నిలిచిన తెలంగాణ, తాజాగా నాగ్‌పూర్ వేదికగా జరిగిన 69వ డ్యూటీ మీట్‌లోనూ అదే జోరును కొనసాగించి వరుసగా మూడోసారి

⏭ తరువాయి 2లో

# భక్తిలో సైతం బాధ్యత

## హనుమాన్ జయంతి శోభాయాత్రలో సైబర్ నేరాల పట్ల అవగాహన



*సురక్ష న్యూస్ డెస్క్:*

గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా ప్రజలు ఎక్కువగా కూడే ప్రదేశాల్లో—గుడి, బడి, సభలు, సమావేశ స్థలాలు పోలీసుల దృష్టిలో కేవలం సమూహాలు కాదు. ప్రజాభద్రతకు కీలక కేంద్రాలు. ఈ వేదికలను వినియోగిస్తూ పోలీసులు రోజురోజుకీ పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, ఉద్యోగ అవకాశాల పేరుతో జరిగే దందాలు, పెట్టుబడుల మాయాజాలం వంటి అంశాలపై ప్రజలను అప్రమత్తం చేయడం కోసం ప్రత్యక్షంగా చేరుకుని సరైన సూచనలు అందిస్తున్నారు. అప్రమత్తంగా ఉండాలని పిలుపునిస్తున్నారు. ఇలాంటి సంఘటన సైబరాబాద్ పరిధిలో గురువారం జరిగిన హనుమాన్ జయంతి శోభాయాత్ర సందర్భంగా భక్తి ఉత్సాహంతో పాటు ప్రజాభద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు మరోసారి తమ కర్తవ్య నిబద్ధతను చాటుకున్న సంఘటన చోటు చేసుకుంది. ప్రజల రక్షణే లక్ష్యంగా ఎల్లప్పుడూ ముందుండే పోలీస్ శాఖ, భక్తి సమూహాల మధ్య కూడా భద్రతపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రితిరాజ్ శోభాయాత్ర భద్రత ఏర్పాట్లు చూస్తున్నారు. ఈ సందర్భంగా డిసిపి అక్కడికి విచ్చేసిన భక్తులను, యువకులను, స్థానిక ప్రజలను ఉద్దేశించి సైబర్ నేరాలపై, ఉద్యోగులు ఇప్పిస్తాము అంటూ జరిగే మోసాల పైన పైన కీలక సూచనలు చేశారు.

**డిసిపి మాట్లాడుతూ...** "ఆన్‌లైన్‌లో జాబ్ ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగితే అది మోసం అయ్యే అవకాశాలు ఎక్కువ" అని హెచ్చరించారు. "ఇన్వెస్ట్ చేస్తే డబ్బులు రెట్టింపు అవుతాయి" అనే ఆకర్షణీయ ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తి భావంతో కూడిన ఈ వేడుకలో భద్రత అంశాన్ని కూడా గుర్తుచేసిన పోలీసుల పట్ల భక్తులు, స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేశారు. ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్న పోలీసులకు సలాం అంటున్నారు ప్రజలు.

# అరగంటలో రూ.6 లక్షల నగల అప్పగింత




*సురక్ష న్యూస్ డెస్క్:*

శుక్రవారం సాయంత్రం సుమారు 7.00 గంటల సమయంలో ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న (ఎన్ఆర్ఐ) ఐటీ ఉద్యోగి సతీష్ కెపిహెచ్‌బీ ప్రాంతంలోని ఖజానా జువెలర్స్‌లో సుమారు రూ.6,00,000 విలువ గల రెండు బంగారు గాజులను కొనుగోలు చేశారు. తదనంతరం, వసంత నగర్‌లో నివసిస్తున్న తన మిత్రుడి ఇంటికి ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో, ఆయన వద్ద ఉన్న నగల బ్యాగ్‌ను అనుకోకుండా కోల్పోయారు. ఈ విషయంపై వెంటనే కెపిహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు అప్రమత్తంగా స్పందించి, తక్షణమే దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ మరియు ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో కేవలం అరగంటలోనే సంబంధిత ఆటోను గుర్తించి, అందులో ఉన్న నగలను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. రువాత, కోల్పోయిన బంగారు నగలను యజమానికి సురక్షితంగా అప్పగించారు. పోలీసుల వేగవంతమైన చర్యలకు సతీష్ గారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యాచరణలో ఎస్‌హెచ్‌ఓ రాజశేఖర్, డిఐ కె.ఎస్. రవి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆస్తి రక్షణలో ఎప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తామని పోలీసులు తెలిపారు.

# ఖాకీ కరుణామయులు



*కామారెడ్డి సురక్ష ప్రతినిధి.*

నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నాగిరెడ్డిపేట కేంద్రంలో పోలీసులు తమ వృత్తి ధర్మాన్ని నెరవేర్చడమే కాకుండా, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. నరాల బలహీనతతో బాధపడుతూ, ఆర్థిక స్తోమత లేక వైద్యానికి నోచుకోని దుర్గవ్వ అనే వృద్ధురాలి పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆమెకు అండగా నిలిచారు. పోలీసుల ఈ సేవా దృక్పథం స్థానికంగా అందరి మన్ననలను పొందుతోంది.

ఈ విషయం తెలియగానే ఎల్లారెడ్డి సిఐ రాజారెడ్డి మరియు నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్ గౌడ్ వెంటనే వృద్ధురాలి నివాసానికి చేరుకుని, ఆమె ఆరోగ్య పరిస్థితిని మరియు కుటుంబ దీనస్థితిని స్వయంగా పరిశీలించారు. చికిత్స కోసం ఇబ్బంది పడుతున్న ఆమె పరిస్థితిని గమనించిన అధికారులు వెనుకాడకుండా తమ సిబ్బందిని సమన్వయం చేసుకున్నారు. పోలీసు సిబ్బంది అంతా కలిసి తమవంతు ఆర్థిక సహకారాన్ని సేకరించారు. సేకరించిన రూ. 20,000 నగదును స్వయంగా వృద్ధురాలికి అందజేసి, ఆమెకు ధైర్యాన్ని ఇచ్చారు. బాధ్యతాయుతమైన పోలీసు అధికారులుగా నేర నియంత్రణలో ముందుండటమే కాకుండా, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో కూడా తాము ముందుంటామని వారు నిరూపించారు. పోలీసుల ఈ ఉదారతను చూసి స్థానికులు వారిని అభినందించడమే కాకుండా, పోలీసు వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని ఈ ఘటన మరింతగా పెంచిందని కొనియాడారు. మానవత్వంతో స్పందించి వృద్ధురాలికి అండగా నిలిచిన ఎల్లారెడ్డి సీఐ, నాగిరెడ్డిపేట ఎస్సై మరియు సిబ్బందిని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఎల్లారెడ్డి డి.ఎస్.పి గారు కూడా సిబ్బంది సేవా భావాన్ని ప్రశంసించారు. ప్రజలకు ఆపద సమయంలో అండగా ఉండటమే పోలీసు వ్యవస్థ అసలైన ఉద్దేశమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.


## ఆర్టీసి బస్సులో పోగొట్టుకున్న నగలు, నగదు బ్యాగ్ అందజేత



*రామగుండం పోలీస్ కమీషనరేట్ సురక్ష ప్రతినిధి :*

రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జిల్లా లక్షెట్టి పేట్ పోలీసులు బస్సులో ఒక మహిళ తన బ్యాగును మరిచిపోగా అట్టి బ్యాగును గుర్తించి పోగొట్టుకున్న మహిళకు అందించినారు. గొల్లపల్లి మండలం దోనురుకు చెందిన కొల్లూరి భాగ్యలక్ష్మి అనే మహిళ పని నిమిత్తం ఉట్నూరు వెళ్ళింది. అక్కడ పని ముగించుకొని తిరిగి అదిలాబాదు నుండి మంచిర్యాల వెళ్లే ఆదిలాబాద్ డిపో బస్సు ఎక్కి లక్షెట్టిపేట బస్టాండ్ లో దిగింది. ఆమె దిగిన తర్వాత తన బ్యాగ్ బస్సులోనే మరిచిపోవడంతో వెంటనే లక్షెటిపేట పోలీసులకు సమాచారం అందజేసింది. లక్షెట్టిపేట బ్లూ కోర్టు విధులు నిర్వహిస్తున్న ఎంబడి సత్యనారాయణ, రాజేందర్ లు వెంటనే బస్టాండ్ చేరుకొని బస్సు వివరాలు సేకరించి మంచిర్యాల డిపో మేనేజర్ మాట్లాడి మహిళా మరిచిపోయిన బ్యాగును తిరిగి తెప్పించి బాధితురాలికి అప్పగించారు. పోగొట్టుకున్న మహిళ బ్యాగులో *అర తులం పైన బంగారం చైన్ తో పాటు 4000 వేల రూపాయల నగదు కూడా ఉండడంతో తిరిగి తన సుమారు లక్ష* విలువ కలిగిన విలువైన వస్తువు, నగదు ను పోలీస్ తక్షణ స్పందనతో తాను పొందడంతో ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసుల సేవల పట్ల బాధితురాలు సంతోషం వ్యక్తం చేసింది.

# ఫ్యూచర్ సిటి సీ.పీ ఉప్పల్ స్టేడియం సందర్శన



*ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ - సురక్ష ప్రతినిధి*

ఉప్పల్ స్టేడియంలో 05.04.2026న జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో ప్రేక్షకుల భద్రత మరియు ట్రాఫిక్ నియంత్రణపై ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు గారు నేడు స్టేడియంను సందర్శించి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మ్యాచ్‌ల నిర్వహణకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలతో పాటు షీ టీమ్స్ (SHE Teams), ఆక్టోపస్ బలగాలను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. స్టేడియం లోపల సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర నిఘా ఉంచుతామని తెలిపారు. మహిళా ప్రేక్షకుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ షీ టీమ్స్‌ను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రేక్షకులు సురక్షితంగా ఇంటికి చేరేందుకు మెట్రో సేవల సమయాన్ని పొడిగించాలని సంబంధిత అధికారులను కోరినట్లు వెల్లడించారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు వాహనదారులు పోలీసులకు సహకరించాలని, కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలపాలని సూచించారు. ప్రేక్షకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మ్యాచ్‌ను ఆస్వాదించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

# ట్రాఫిక్ పోలీసులకు చల్లని నీటి బాటిల్స్



*సురక్షా ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా*

ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సుశ్రుత పీపుల్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో చల్లని నీటి బాటిల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా హాస్పిటల్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రతిరోజూ తీవ్ర ఎండలో పనిచేస్తున్న సిబ్బంది తమ వద్ద చల్లని నీరు నిల్వ ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. ప్రతినిత్యం విధుల్లో ఉన్న సమయంలో ఉపయోగించుకునేందుకు ట్రాఫిక్ సిబ్బందికి వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది డాక్టర్ మధుసూదన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ పోలీస్ సురక్ష

శనివారం, 04 ఏప్రిల్ 2026

## మొదటి పేజీ తరువాయి...

ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయం రాష్ట్ర పోలీసుల వృత్తి నైపుణ్యానికి, సన్నద్ధతకు మరియు క్షేత్రస్థాయిలో వారు కనబరుస్తున్న పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుందని డిజిపి ప్రశంసించారు. నాగ్‌పూర్ పోటీల్లో వివిధ విభాగాల్లో తెలంగాణ బృందం తన ఆధిపత్యాన్ని చాటుకుందన్నారు. ముఖ్యంగా అత్యంత క్లిష్టమైన యాంటీ సాబోటేజ్ చెక్, వీడియోగ్రఫీ మరియు కంప్యూటర్ అవేర్‌నెస్ పోటీల్లో రాష్ట్ర పోలీసులు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సొంతం చేసుకున్నారని కొనియాడారు. వీటితో పాటు సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ మరియు పోలీస్ ఫోటోగ్రఫీ విభాగాల్లోనూ ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీలను గెలుచుకున్నారన్నారు. అత్యాధునిక సాంకేతికతను నేర పరిశోధనలో వినియోగించడంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే ముందంజలో ఉందని ఈ ఫలితాలు మరోసారి రుజువు చేశాయనీ, శాస్త్రీయ నేర పరిశోధన, వినూత్న పద్ధతుల అవలంబన మరియు నిరంతర సామర్థ్య పెంపుదల పట్ల తెలంగాణ పోలీస్ శాఖ చూపుతున్న నిబద్ధతకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు దక్కిందని భావిస్తున్నారు. ప్రజల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు, సమర్థవంతమైన చట్ట అమలుకు ఈ తరహా వృత్తిపరమైన నైపుణ్యాలు ఎంతగానో దోహదపడతాయని డిజిపి బి.శివధర్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. 6 బంగారు, 3 వెండి, 3 కాంస్య పతకాలు గెలుచుకున్న సందర్భంగా సిఐడి అడిషనల్ డీజీపీ చారు సిన్హా ను, ప్రధాన కోచ్ లు డి. ప్రతాప్( అదనపు ఎస్పీ టీజీ జెన్‌కో), ఎం. రామకృష్ణ (కమాండెంట్ 8వ బెటాలియన్), టీమ్ మేనేజర్ కె. ప్రసాద్ (ఎస్పీ సీఐడీ) లను, విజేతల కృషిని డిజిపి కొనియాడారు.



జయ ప్రకాశ్ గౌడ్, ఎస్.ఐ,
సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్,
(మెడికో లీగల్ సిల్వర్)



రాధిక యాదవ్, ఎస్.ఐ,
సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్,
(మెడికో లీగల్ బ్రాంజ్)



ఎం.వి.ఎస్.ఎన్ రెడ్డి,
ఎ.ఆర్.ఎస్.ఐ
(కంప్యూటర్ ప్రొగామింగ్ లో గోల్డ్)



టి.సురేష్, ఎ.ఆర్.పి.సి-9018,
ట్రాఫిక్ అడ్మిన్,
పోలీస్ వీడియో గ్రఫీ బ్రాంజ్

# నాగ్‌పూర్‌లో ఘనంగా 69వ

# అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్



ఎం.దేవేందర్ ప్రసాద్
ఎ.ఆర్.హెచ్.సి 3378
(పోలీస్ వీడియో గ్రఫీ లో గోల్డ్)

*సురక్ష న్యూస్ డెస్క్:*

69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్ 2025–26 మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో మార్చి 28 నుండి ఏప్రిల్ 2, 2026 వరకు ఘనంగా నిర్వహించారు. నాగ్‌పూర్‌లో 69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్ (2025–2026) ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మార్చి 29, 2026 న నాగ్‌పూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అశిష్ జైస్వాల్, మహారాష్ట్ర డీజీపీ సదానంద్ డేట్, ఏడీజీ (సీఐడీ) పుణే సునీల్ రామానంద్, ఏడీజీ (అడ్మిన్) మహారాష్ట్ర మధుకర్ పాండే, నాగ్‌పూర్ పోలీస్ కమిషనర్ డా. రవీందర్ సింగల్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ డ్యూటీ మీట్ ప్రధానంగా శాస్త్రీయ దర్యాప్తు నైపుణ్యాల పెంపుపై దృష్టి వృత్తిపరమైన, ఫోరెన్సిక్ మరియు శాస్త్రీయ పోలీసింగ్ నైపుణ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా నిర్వహిస్తారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాలు నుంచి 1,300 మందికి పైగా పోలీస్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్‌లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. మహారాష్ట్ర పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్యూటీ మీట్ దేశ స్థాయిలో పోలీస్ శాఖల మధ్య నైపుణ్యం, సామర్థ్య పెంపుకు వేదికగా నిలిచింది. ఈ డ్యూటీ మీట్‌లో ముఖ్యంగా శాస్త్రీయ దర్యాప్తుకు సంబంధించిన అంశాలపై పోటీలు నిర్వహించారు. ఫోరెన్సిక్ సైన్స్ వినియోగం, శాస్త్రీయ ఆధారాల సేకరణ, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవగాహన, యాంటీ సాబోటేజ్ చెక్ వంటి విభాగాల్లో పాల్గొన్న బృందాలు తమ నైపుణ్యాలను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పోలీస్ సిబ్బందిలో ఆధునిక దర్యాప్తు పద్ధతులపై అవగాహన పెంచడం, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, నేర పరిశోధనలో శాస్త్రీయ విధానాలను మరింత సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రోత్సహించడం అని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు పోలీస్ శాఖల మధ్య పరస్పర అనుభవాలను పంచుకునే అవకాశం కల్పించడమే కాకుండా, నేర నియంత్రణలో ఆధునిక సాంకేతికత వినియోగానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

### జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీస్ సత్తా

అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీస్ విభాగం మరోసారి సత్తా చాటుతూ వరుసగా మూడోసారి ‘ఓవరాల్ ఛాంపియన్’ ట్రోఫీని కైవసం చేసుకుని హ్యాట్రిక్ విజయం సాధించింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన 69వ జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ బృందం అద్భుత ప్రతిభ కనబరిచింది. ఈ ఘనతపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ అభినందనలు తెలియజేస్తూ డీజీపీ బి. శివధర్ రెడ్డి, సిఐడి అడిషనల్ డీజీపీ చారు సిన్హా మరియు విజేతలను ప్రశంసించారు. డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ విజయం తెలంగాణ పోలీసుల వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, శాస్త్రీయ దర్యాప్తు సామర్థ్యాలకు నిదర్శనమన్నారు. యాంటీ సాబోటేజ్ చెక్, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్‌లో ప్రథమ స్థానాలు, అలాగే ఇతర విభాగాల్లో కూడా ప్రతిభ కనబరిచి మొత్తం 6 బంగారు, 3 వెండి, 3 కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

### వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్

అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీస్ విభాగం సరికొత్త చరిత్ర సృష్టిస్తూ వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడం గర్వకారణంగా నిలిచింది. 2023–24లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో, 2024–25లో జార్ఖండ్‌లోని రాంచీలో, 2025–26లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన 69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లోనూ విజయం సాధించి అరుదైన హ్యాట్రిక్‌ను నమోదు చేసింది. ఈ వరుస విజయాలు తెలంగాణ పోలీస్ శాఖ జాతీయ స్థాయిలో తన ప్రతిభ, నైపుణ్యం మరియు క్రమశిక్షణను మరోసారి చాటుకున్నట్లు చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా పోలీస్ విభాగాల మధ్య జరిగే ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో నిరంతరంగా అగ్రస్థానంలో నిలవడం తెలంగాణ పోలీసుల శిక్షణా స్థాయి, శాస్త్రీయ దర్యాప్తు సామర్థ్యం, సాంకేతిక వినియోగానికి నిదర్శనం. తెలంగాణ పోలీస్ శాఖ అన్ని రంగాల్లో పోలీస్ సిబ్బందికి సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శిక్షణలు, ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఈ విధానమే రాష్ట్ర పోలీస్ విభాగాన్ని జాతీయ స్థాయిలో ముందంజలో నిలబెట్టిందని అధికారులు పేర్కొన్నారు. ఈ విజయాలతో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ఆదర్శంగా నిలుస్తూ, మరింత సమర్థవంతమైన పోలీసింగ్‌కు మార్గం సుగమం చేస్తోందని అభిప్రాయపడ్డారు.












## 90 లక్షల విలువ గల
# నిషేధిత పత్తి విత్తనాల సీజ్

*సురక్ష న్యూస్ డెస్క్:*

విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి నిషేధిత BG-III పత్తి విత్తనాల అక్రమ రవాణాను అడ్డుకున్నారు. పోలీస్ లు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో AP 39 VE 4038 నంబర్ గల మహీంద్రా బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 3000 కిలోల నిషేధిత BG-III పత్తి విత్తనాల ను పోలీసులు గుర్తించారు. వీటి మార్కెట్ విలువ సుమారు రూ.90,00,000/- కాగా, వాహనం విలువ రూ.8,00,000/- కలిపి మొత్తం రూ.98,00,000/- విలువైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో చెవుల నర్సింలు (34), వాహన యజమాని & ట్రాన్స్‌పోర్టర్, తాలారి రమేష్ (24), డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా, కోసిగి మండలం, పల్లెపాడు గ్రామానికి చెందినవారని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు మాగులూరి సాంబ శివరావు (సప్లయర్) అనే వ్యక్తి ఈ అక్రమ రవాణాకు పాల్పడినట్లు గుర్తించారు. ఇతను కర్నూలు జిల్లా కోసిగి మండలం దుద్ది గ్రామానికి చెందిన శివ రావు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సాంబ శివరావు, చెవుల నర్సింలు వాహనాన్ని రూ.30,000/- కిరాయికి తీసుకుని, కర్నూలు నుండి



మహారాష్ట్ర రాష్ట్రం నాగపూర్‌కు 3000 కిలోల BG-III పత్తి విత్తనాలను తరలించేందుకు యత్నించాడు. తనిఖీలకు తప్పించుకోవడానికి విత్తన సంచులను కాబేజీ సంచుల మధ్య దాచిపెట్టినట్లు పోలీసులు వెల్లడించారు. వాహనం కర్నూలు నుండి నాగపూర్ వైపు బయలుదేరగా, మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. నాగపూర్ చేరుకున్న తరువాతే రిసీవర్ వివరాలు వెల్లడిస్తానని సప్లయర్ సూచించినట్లు విచారణలో తేలింది. అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించి తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. నిషేధిత విత్తనాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరిస్తూ, నకిలీ, నిషేధిత విత్తనాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



*హైదరాబాద్ సురక్ష ప్రతినిధి :*

స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు.. క్షణాల్లో లక్షలు సంపాదించవచ్చనే ఆశ చూపి యువతను తప్పుదోవ పట్టిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా ఆట కట్టించారు గోషామహల్ పోలీసులు. వెబ్‌సైట్ల ద్వారా అక్రమంగా బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు యువకులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు.

*వెబ్‌సైట్ల ద్వారా బెట్టింగ్*

నమ్మదగిన సమాచారం మేరకు గోల్కొండ జోన్ డీసీపీ శ్రీ చంద్ర మోహన్, ఏసీపీ ఎస్. సుదర్శన్ పర్యవేక్షణలో గోషామహల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రవణ్ కుమార్ బృందం దాడులు నిర్వహించింది. CricCode, Stake, మరియు Future Play వంటి వెబ్‌సైట్ల ద్వారా నిందితులు బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

*నిందితుల వివరాలు*

అరెస్టయిన వారిలో కర్మన్‌ఘాట్‌కు చెందిన అనురాగ్ రామవత్ (22), గౌలిగూడకు చెందిన ధవల్ ఖత్రీ (22), పురానాపూల్‌కు చెందిన కృష్ణ (21) ఉన్నారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు కాగా, ఒకరు వ్యాపారం చేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన అనురాగ్ రామవత్ నగరంలో విద్యార్థిగా ఉంటూనే ఈ అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు వెల్లడైంది. నిందితుల నుంచి ఐఫోన్ 17, ఐఫోన్ 15 ప్రో మరియు ఒప్పో రెనో 2ఎఫ్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

*తల్లిదండ్రులకు పోలీసుల విజ్ఞప్తి*

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది ఒక వ్యసనంగా మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్లలో ఏం చేస్తున్నారో గమనించాలని, ముఖ్యంగా ఇలాంటి జూదాలకు అలవాటు పడకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహించినా, ఆడినా లేదా ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో గోషామహల్ పోలీసులు మరియు పీసీ మనీష్ కుమార్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపడుతున్నారు.

# కన్న తల్లి బంగారమే కాజేసిన కొడుకు



*హైదరాబాద్ సురక్ష ప్రతినిధి :*

బయటి వ్యక్తులు వచ్చి దొంగతనం చేస్తారేమోనని ఇంట్లోని వారు జాగ్రత్త పడతారు. కానీ, కంచెయే చేను మేసిన చందంగా.. కన్న కొడుకే తల్లి, సోదరి బంగారాన్ని దొంగిలించిన ఘటన హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. విలాసాలకు అలవాటు పడి, స్నేహితులతో కలిసి సొంత ఇంట్లోనే ఆభరణాలు కాజేసిన నిందితుడిని, అతడికి సహకరించిన మరో ఇద్దరిని రాజేంద్రనగర్ జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు పూర్వాపరాలు: హఫీజ్ బాబా నగర్‌కు చెందిన మహ్మద్ రహ్మత్ షరీఫ్ మార్చి 31న కంచన్‌బాగ్ పోలీసులను ఆశ్రయించారు. జనవరి 17న తన భార్య, కుమార్తెకు చెందిన బంగారు నెక్లెస్‌లు, గొలుసులను బీరువాలో భద్రపరిచామని, అయితే మార్చి 29న చూసేసరికి అవి మాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు బీరువా తెరిచి దొంగతనం చేశారని బాధితుడు అనుమానం వ్యక్తం చేశారు. తేటతెల్లమైన అసలు నిజం: రాజేంద్రనగర్ జోన్ డిసిపి శ్రీ ఎస్. శ్రీనివాస్, ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన కంచన్‌బాగ్ ఎస్.హెచ్.ఓ వై. కమల్ కుమార్ బృందం విస్తుపోయే నిజాలను కనుగొన్నారు. బాధితుడి కుమారుడు మహ్మద్ అద్నాన్ షరీఫ్ (19) విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి ఈ చోరీకి పాల్పడినట్లు తేలింది. జనవరి నెలలో జరిగిన ఒక ఫంక్షన్‌లో తన తల్లి, సోదరి ధరించిన నగలను గమనించిన అద్నాన్, వాటిని కాజేయాలని ప్లాన్ చేశాడు. నేర విధానం: అద్నాన్ తన స్నేహితులైన మహ్మద్ రెహాన్ ఉద్దీన్, మహ్మద్ సమీర్‌లను కలిసి తన ప్లాన్ వివరించాడు. సులభంగా డబ్బు సంపాదించవచ్చని భావించిన వారు కూడా ఇందుకు అంగీకరించారు. జనవరి నుండి మార్చి వరకు మొత్తం నాలుగు సార్లు ఇంట్లో ఎవరికీ తెలియకుండా బీరువాలో నుండి నగలు తీసి బయటకు తీసుకువచ్చాడు. వాటిని విక్రయించి నగదుగా మార్చడానికి తన స్నేహితులకు అప్పగించాడు. పోలీసుల చర్యలు: పక్కా సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుండి: 137 గ్రాముల (సుమారు 13.7 తులాల) బంగారం, ఒక వెర్నా కారు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అభినందనలు: చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ. సుధాకర్ గారి పర్యవేక్షణలో కేసును వేగంగా ఛేదించిన ఎస్.హెచ్.ఓ కమల్ కుమార్, ఎస్.ఐ కె. రాజు మరియు క్రైమ్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

## కారు ఢీకొని
# రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతి



*నల్లగొండ జిల్లా సురక్షా ప్రతినిధి :*

దేవరకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈరోజు ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో జాతీయ రహదారి NH-167 పై యెల్లారెడ్డి బావి గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన వివరాల ప్రకారం, తొటకూరి తిరుపతి కుమార్, నివాసం: యెల్లారెడ్డి బావి గ్రామం, దేవరకొండ మండలం, నల్గొండ జిల్లా చెందిన వ్యక్తి రోడ్డును కాలినడకన దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అదే సమయంలో, రాగిణి భాస్కర్ గౌడ్,నాగనూల్ గ్రామం, నాగర్‌కర్నూల్ జిల్లా నివాసి, తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో దేవరకొండ నుండి నాగర్‌కర్నూల్ వైపు ప్రయాణిస్తున్నాడు. ఆయన నడుపుతున్న కారు (నంబర్: TG-31-B-2777)ను అతివేగంగా మరియు నిర్లక్ష్యంగా నడపడంతో, రోడ్డును దాటుతున్న తిరుపతి కుమార్‌ను వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతి కుమార్‌కు తలకు మరియు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్రమైన గాయాలు కావడంతో, వెంటనే స్థానికులు మరియు పోలీసులు కలిసి ఆసుపత్రికి తరలించారు. అయితే, వైద్యులు పరిశీలించి ఆయన అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెంకట్ రెడ్డి తెలిపారు. అలాగే, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# మామిడి పండ్లను రసాయనాలతో మగ్గబెడుతున్న వ్యక్తి అరెస్ట్



*హైదరాబాద్, సురక్ష ప్రతినిధి :*

వేసవి కాలం ప్రారంభంలోనే మామిడి పండ్ల విక్రయాలు జోరందుకుంటున్న వేళ, అధిక లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ముఠాలపై పోలీసులు నిఘా పెట్టారు. మామిడి పండ్లను కృత్రిమంగా, నిబంధనలకు విరుద్ధంగా మగ్గబెడుతున్న ఒక వ్యాపారిని గోషామహల్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.

**అధిక లాభాల కోసం అడ్డదారులు...**

నమ్మదగిన సమాచారం మేరకు గోల్కొండ జోన్ డీసీపీ శ్రీ చంద్ర మోహన్, ఏసీపీ ఎస్. సుదర్శన్ ఆదేశాలతో గోషామహల్ ఎస్.హెచ్.ఓ బి. శ్రవణ్ కుమార్ నేతృత్వంలోని బృందం చూడీ బజార్‌లోని బాలకృష్ణ మందిరం సమీపంలో ఉన్న ఒక గోదాంపై మెరుపు దాడి చేసింది. ఈ తనిఖీల్లో పురానాపూల్‌కు చెందిన నికాబ్‌వాలా కునాల్ (32) అనే పండ్ల వ్యాపారి ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ (FSSAI) నిబంధనలను బేఖాతరు చేస్తూ మామిడి పండ్లను మగ్గబెడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

**పరిమితికి మించి రసాయనాల వినియోగం..** సాధారణంగా ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ మార్గదర్శకాల ప్రకారం.. 20 కేజీల మామిడి పండ్ల ట్రేని మగ్గబెట్టడానికి గరిష్టంగా 5 ఇథిలీన్ సాచెట్లను వాడటం సురక్షితం. అయితే నిందితుడు పండ్లు త్వరగా రంగు రావడానికి, ఎక్కువ లాభం పొందడానికి 6 లేదా అంతకంటే ఎక్కువ సాచెట్లను వాడుతున్నట్లు విచారణలో తేలింది. మోతాదుకు మించి రసాయనాలు వాడటం వల్ల ఈ పండ్లను తినే ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

**కేసు నమోదు - వస్తువుల స్వాధీనం...** నిందితుడి నుంచి సుమారు 29 ఇథిలీన్ రైపెనర్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 104/2026 కింద, కొత్త చట్టం BNS సెక్షన్ 318(4) తో పాటు ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారు.

**పోలీసుల హెచ్చరిక...** ఈ సందర్భంగా ఎస్.హెచ్.ఓ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. "ఎవరైనా వ్యాపారులు పండ్లను మగ్గబెట్టడానికి నిషేధిత రసాయనాలు వాడినా లేదా అనుమతించిన పరిమితి దాటినా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆరోగ్యం మాకు ముఖ్యం. ఎక్కడైనా ఇలాంటి అక్రమ నిల్వలు లేదా కృత్రిమ పద్ధతులు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి" అని కోరారు.

# తమిళనాడు ఎన్నికలకు తెలంగాణ పోలీస్




*ఒకటవ బెటాలియన్ సురక్ష ప్రతినిధి*

తమిళనాడు రాష్ట్రంలో ఈ నెల 23 న జరుగనున్న అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఒకటవ బెటాలియన్ టీజీఎస్పీ నుండి ఒక కంపెనీ(120) సిబ్బంది బందోబస్త్ విధులు నిర్వహించేందుకు గురువారం బయలుదేరనున్నారు. వీరితో పాటుగా రాష్ట్ర మరో తొమ్మిది బెటాలియన్ లకు చెందిన కంపెనీలు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, విధి నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించే విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే విధుల్లో అప్రమత్తంగా ఉండి, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ బందోబస్త్‌కు ఒకటవ బెటాలియన్ సిబ్బందికి ఇన్‌చార్జ్‌గా అసిస్టెంట్ కమాండెంట్ కె.వి.వి. ప్రసాద్ వ్యవహరిస్తున్నారు.

# సిద్దిపేటలో పరిస్థితి పూర్తిగా ప్రశాంతం: వదంతులను నమ్మవద్దు

*సిద్ధిపేట సురక్ష ప్రతినిధి*

సిద్దిపేట పట్టణంలో ప్రస్తుత పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా, పోలీసుల నియంత్రణలో ఉందని సిద్దిపేట వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్) వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలను ప్రజలు నమ్మవద్దు. అవాస్తవాలను ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100కు సమాచారం అందించాలి. బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరిస్తూ శాంతి స్థాపనకు సహకరించాలని సూచించారు. సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు కూడా అప్రమత్తంగా ఉండి, రెచ్చగొట్టే పోస్టులను అనుమతించవద్దని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వాసుదేవరావు సూచించారు.




# ఒకే రోజు 308 మందిపై సెల్ ఫోన్ డ్రైవింగ్ కేసులు నమోదు



*హైదరాబాద్, సురక్ష ప్రతినిధి :*

నగర రహదారులపై ప్రయాణాన్ని సురక్షితం చేసేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా సారించారు. డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) శ్రీ డి. జోయల్ డేవిస్, ఐ.పి.ఎస్. గారి ఆదేశాల మేరకు నగరం అంతటా ప్రత్యేక తనిఖీలు (Special Drive) నిర్వహించారు.

**ఒకే రోజులో భారీగా కేసులు**

ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించిన ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 308 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ విభాగం వెల్లడించింది. ఇందులో అత్యధికంగా 262 మంది ద్విచక్ర వాహనదారులు ఉండగా, 43 మంది ఫోర్ వీలర్ డ్రైవర్లు, ముగ్గురు ఆటో డ్రైవర్లు మొబైల్ ఫోన్ వాడుతూ పట్టుబడ్డారు.

**ఏకాగ్రత చెదరితే ప్రాణాపాయం**

ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. "వాహనం నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ వాడటం అనేది కేవలం ట్రాఫిక్ ఉల్లంఘన మాత్రమే కాదు, అది ఒక ప్రాణాంతకమైన అలవాటు. ఫోన్ మాట్లాడటం లేదా మెసేజ్లు చూడటం వల్ల డ్రైవర్ ఏకాగ్రత దెబ్బతిని, అత్యవసర సమయంలో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. ఇది సదరు వాహనదారుడితో పాటు తోటి ప్రయాణికులను కూడా ప్రమాదంలోకి నెడుతుంది" అని హెచ్చరించారు.

**తనిఖీలు మరింత ముమ్మరం**

సెల్ ఫోన్ డ్రైవింగ్ విషయంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 'జీరో టోలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కూడా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

రహదారి నిబంధనలు ప్రతి ఒక్కరి క్షేమం కోసమేనని, డ్రైవింగ్ చేసే సమయంలో ఫోన్లను పక్కన పెట్టి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ పోలీసుల కృషితో పాటు ప్రజల సహకారం ఉంటేనే ప్రమాదరహిత హైదరాబాద్‌ను నిర్మించగలమని ఆయన ఆకాంక్షించారు.

# నిర్మాణ పనుల దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపులు



హైదరాబాద్ సురక్ష ప్రతినిధి :

హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ & ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (H-CITI) లో భాగంగా బంజారాహిల్స్ మరియు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరుగుతున్న స్టీల్ ఫ్లైఓవర్ మరియు అండర్‌పాస్ నిర్మాణ పనుల దృష్ట్యా, ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. ఆదివారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల మధ్య (1100 HRS TO 1300 HRS) కేబీఆర్ పార్క్ (KBR Park) చుట్టుపక్కల ఉన్న అన్ని రహదారులలో ట్రాఫిక్‌ను వన్ వే ట్రయల్ రన్ (ONE WAY TRIAL RUN) గా నిర్వహించడం జరుగుతుంది. ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ముందస్తుగా ప్లాన్ చేసుకోవాలని మరియు ఈ క్రింది రోడ్డు మళ్లింపులను ఉపయోగించుకోవాలని, అలాగే వారి ప్రయాణ మార్గాన్ని ప్లాన్ చేసుకోవాలని సూచించడమైనది: NFCL నుండి SNT, సాగర్ సొసైటీ (ముగ్ధ), KBR పార్క్ ఎంట్రన్స్ & జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, రోడ్ నెం.36, రోడ్ నెం.45 మరియు కేబుల్ బ్రిడ్జి (దుర్గం చెరువు) వైపు వెళ్లే ట్రాఫిక్: ప్రయాణికులు ఇబ్బందులను నివారించడానికి ఈ క్రింది మార్గాన్ని అనుసరించాలని సూచించడమైనది - NTR భవన్ వద్ద ఎడమ మలుపు తీసుకుని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వైపు వెళ్లాలి - అగ్రసేన్ ఐలాండ్ ద్వారా ప్రయాణించి ఒమేగా హాస్పిటల్ వైపు కొనసాగాలి - అక్కడ నుండి రోడ్ నెం. 45, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, కేబుల్ బ్రిడ్జి మరియు IKEA వైపు వెళ్లాలి. యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీ నుండి రోడ్ నెం. 36 & 45, జూబ్లీహిల్స్, మాదాపూర్ వైపు వెళ్లే ట్రాఫిక్: ప్రయాణికులు సాఫీగా మరియు సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ఈ క్రింది మార్గాన్ని అనుసరించాలని సూచించడమైనది - ఇందిరానగర్ గడ్డ రోడ్ (రోడ్ నెం.5, జూబ్లీహిల్స్) ద్వారా వెంకటగిరి జంక్షన్ వైపు వెళ్లాలి - వెంకటగిరి జంక్షన్ వద్ద కుడి మలుపు తీసుకోవాలి - డైమండ్ హౌస్ ద్వారా రోడ్ నెం. 10, జూబ్లీహిల్స్ వైపు కొనసాగాలి - ఇంకా ముందుకు అల్-కాజర్ (Al-Cazar) వైపు వెళ్లి, కుడి మలుపు తీసుకుని రోడ్ నెం. 36, జూబ్లీహిల్స్ వైపు ప్రయాణించాలి, ఇది నీరుస్ (Neerus') మరియు రోడ్ నెం.45, జూబ్లీహిల్స్, మాదాపూర్ వైపు దారి తీస్తుంది.

మరిన్ని సూచనలు: ప్రయాణికులు ఆదివారం ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 1:00 గంటల మధ్య పేర్కొన్న ట్రాఫిక్ మళ్లింపులను పాటించాలి. పేర్కొన్న నిర్ణీత మార్గాల్లో ఎటువంటి 'U' టర్న్‌లు ఉండవు; సరైన మరియు ఇబ్బంది లేని నిష్క్రమణల (Exits) కోసం రోడ్డుకు ఎడమ (LEFT) వైపున ప్రయాణించాలి. సాఫీగా ట్రాఫిక్ కదలిక కోసం మార్గంలో ఏర్పాటు చేసిన నిర్ణీత ఎగ్జిట్ (EXIT) పాయింట్లను గమనించగలరు. క్షేత్రస్థాయిలోని ట్రాఫిక్ పోలీసుల సూచనలను మరియు సైనేజ్ (సంకేత బోర్డులు) పాటించండి. రియల్ టైమ్ ట్రాఫిక్ అప్‌డేట్స్ కోసం నావిగేషన్ యాప్‌లను ఉపయోగించండి. రద్దీని తగ్గించడానికి ప్రజా రవాణా మరియు కార్ పూలింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వండి. భారీ వాహనాలు రద్దీ సమయాల్లో ఈ మార్గాల్లో రాకుండా ఉండాలని సూచించడమైనది. దీనివల్ల కలిగే అసౌకర్యానికి విచారం వ్యక్తం చేస్తున్నాము. మౌలిక




సదుపాయాల అభివృద్ధి పనుల సమయంలో ట్రాఫిక్ కదలికను సులభతరం చేయడానికి మరియు ప్రజల భద్రతను నిర్ధారించడానికి ఈ చర్యలు తీసుకోబడ్డాయి. తాజా సమాచారం కోసం, హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక కమ్యూనికేషన్ ఛానెల్‌లను అనుసరించండి. సురక్షితంగా ప్రయాణించండి. ట్రాఫిక్ నిబంధనలను పాటించండి.

# క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్ & వైస్ చైర్మన్ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు



రామగుండం పోలీస్ కమిషనరేట్ సురక్ష ప్రతినిధి

క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలను కాపాడేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయబడ్డాయి.ఈ సందర్భంగా బందోబస్తు కోసం ఏసీపీ–04, సీఐ–23, ఎస్ఐ–46, ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుల్–98, పోలీస్ కానిస్టేబుల్–167, మహిళా పోలీస్ సిబ్బంది–49, స్పెషల్ పార్టీ సిబ్బంది–38, హోం గార్డ్స్–60, మొత్తం 485 మంది సిబ్బంది, అలాగే 4 టీజీఎస్పీ ప్లాటూన్లు విధుల్లో పాల్గొంటున్నారు. విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి బెల్లంపల్లి ఏసీపీ శ్రీ కిరణ్ కుమార్ గారు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని,డ్యూటీ ప్రదేశం నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేకుండా వెళ్లకూడదని పేర్కొన్నారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండి సమయానుకూలంగా ప్రవర్తించాలని అన్నారు. అనవసరంగా ప్రజలతో వాగ్వాదాలకు దిగకూడదని,విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగినన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని, ప్రజలు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని ఏసీపీ గారు విజ్ఞప్తి చేశారు.

# గోదావరి పుష్కర ఘాట్ల సందర్శన



నిజామాబాదు జిల్లా సురక్ష ప్రతినిధి

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల తుంగిని పుష్కర ఘాట్లను పర్యవేక్షించడం జరిగింది. ఇందులో భాగంగా 2027 సంవత్సర కాలంలో రాబోయే గోదారి పుష్కరాలతో ఉద్దేశించి పుష్కర ఘాట్ల ఏర్పాట్లు , మహిళలు దుస్తులు మార్చుకునే గదులు , పుష్కర ఘాటుకు వచ్చే రోడ్డు మరియు వెళ్లే దారులను , పార్కింగ్ ప్రదేశాల మరియు నీళ్లలో ఎవరు కూడా మునిగి ప్రాణా నష్టం జరగకుండా  పటిష్ట బందోబస్తు ఏర్పాటులను చేయాలని అధికారులకు సూచించారు గ్రామస్తులతో మాట్లాడి గత పుష్కరాల్లో ఏమేం లోటుపాట్లు ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి పార్కింగ్ సమస్యలు మరియు ఇతర అవరోధాలు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పినారు. ఈ సందర్భంగా నిజామాబాదు నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ , నవీపేట్ ఎస్. ఐ శ్రీకాంత్ , మరియు తుంగిని సర్పంచ్ కాంతారావ్ , ఉపసర్పంచ్  భూమేష్ , గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



సూర్యాపేట జిల్లా సురక్ష ప్రతినిధి :

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎస్.పి నరసింహ ఐపిఎస్ గారు శుక్రవారం రోజున సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు, పోలీస్ స్టేషన్ పరిసరాలు పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డ్స్ ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న కమాండ్ అండ్ కంట్రోల్స్ సెంటర్ ను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమంలో భాగంగా కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, రికార్డు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి భరోసా కల్పించాలని సూచించారు. ప్రజా సమస్యలపై సమాచారం అందిన వెంటనే వేగంగా స్పందిస్తూ బాధితుల వద్ద నుండి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సామాజిక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సైబర్ మోసాలు రోడ్డు ప్రమాదాలు మహిళల భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది అందరూ జట్టుగా పనిచేసే మంచి ఫలితాలు సాధించాలని కోరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి ఆపరేషన్ రోప్ సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను అవగాహన కల్పించాలి అన్నారు. సిబ్బంది అందరూ ఒక జట్టుగా పని చేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఎస్పి గారి వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ లు ఏడుకొండలు, ఐలయ్య, మహేందర్ నాథ్, శివతేజ, సిబ్బంది ఉన్నారు.

# మొబైల్ ఫోన్ ల రికవరీ



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, సురక్ష ప్రతినిధి:

సిర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను CEIR పోర్టల్ సహాయంతో గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ డి. సాగర్ తెలిపారు. నవేగావ్ గ్రామానికి చెందిన డోంగ్రే దశరథ్ తన ఇన్‌ఫినిక్స్ మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడంతో, CEIR పోర్టల్ (www.ceir.gov.in) ద్వారా వివరాలు నమోదు చేయగా, పోలీసులు IMEI ఆధారంగా ట్రేస్ చేసి సంబంధిత వ్యక్తి నుండి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ మొబైల్‌ను బాధితుడికి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి.సాగర్ మాట్లాడుతూ, సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే CEIR పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేస్తే త్వరగా రికవరీ సాధ్యమవుతుందని, ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# సలేశ్వరం జాతర భద్రత ఏర్పాట్లపై డి.ఐ.జి సమీక్ష



నాగర్ కర్నూల్ సురక్ష ప్రతినిధి.

శుక్రవారం ఉదయం జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ ఎస్ చౌహన్ సలేశ్వరం జాతరలో ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జోగులంబ జోన్ డిఐజి ఎల్ ఎస్ చౌహన్ మాట్లాడుతూ సలేశ్వరం జాతరలో 400 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ సంప్రదించాలని, అనవసరంగా ఎవరు కూడా డీప్ ఫారెస్ట్ లోకి వెళ్ళకూడదని సూచించారు. సలేశ్వరం జాతరలో పోలీస్ అధికారులు ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూ విధుల పట్ల సిబ్బంది చూపుతున్న అంకితభావాన్ని ప్రశంసించారు. సలేశ్వరం జాతరలో ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ను ప్రత్యేకంగా అభినందించారు. బందోబస్తు అంటే కేవలం లాఠీలు పట్టుకోవడమే కాదు, ప్రాణాలు కాపాడటం కూడా అని మన పోలీసులు నిరూపించారు. నిన్న రాత్రి లోయలో పడిపోయిన ఆర్టీసీ డ్రైవర్ బాబుమియాను ఎస్సై మురళి, కానిస్టేబుళ్లు ఊర్మిళ, మణికల తమ భుజాలపై మోసుకొచ్చి కాపాడారు. ఈ సాహసాన్ని చూసి డీఐజీ గారు ఫిదా అయ్యారు. "మా సిబ్బంది చూపుతున్న ఈ అంకితభావమే జాతరకు వచ్చే భక్తులకు కొండంత అండ" అని ఆయన కొనియాడారు.

# ఎస్సైగా పదోన్నతి ఎస్పీ చేతుల మీదుగా చిహ్నం



మహబూబ్‌నగర్ జిల్లా, సురక్షా ప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లా డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (DCRB) లో విధు లు నిర్వహిస్తున్న మహమ్మద్ మొయిజుద్దీన్ ఏఎస్ఐ (ASI) నుండి ఎస్సై (SI)గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారి  డి.జానకి, ఆయనకు పదోన్నతి చిహ్నాన్ని తన చేతుల మీదుగా బహుకరించారు. మొహమ్మద్ మొయిజుద్దీన్ 1989 సంవత్సరంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా లో పోలీస్ కానిస్టేబుల్‌గా సేవలో ప్రవేశించి, అలంపూర్, తిమ్మాజిపేట్, జడ్చర్ల, పెద్దకొతపల్లి, కోస్గి పోలీస్ స్టేషన్లలో కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. అనంతరం 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2018లో ఏఎస్ఐగా పదోన్నతులు పొందారు. DCRB, CCS మహబూబ్‌నగర్, హన్వాడ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో సేవలందించి, ప్రస్తుతం కోయిలకొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. తన విశిష్ట సేవలకు గాను ఇప్పటివరకు 70 కాష్ రివార్డులు, 18 GSEలు, 12 ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అదేవిధంగా 2013లో సేవా పతకం, 2017లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీస్ పతకం, 2019లో ఉత్తమ పోలీస్ పతకం, 2025లో IPM మెడల్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, మాట్లాడుతూ, " మొయిజుద్దీన్ క్రమశిక్షణ, అంకితభావం, ప్రజా సేవ పట్ల నిబద్ధత ప్రశంసనీయం. ఈ పదోన్నతి ఆయన దీర్ఘకాల సేవలకు లభించిన గౌరవం" అని అభినందించారు. అలాగే పదోన్నతి తోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని తెలిపారు.

# ఇష్టంతోనే పోలీసు వృత్తిలోకి...సేవలోనే సంతృప్తి

వనపర్తి జిల్లా సురక్ష బ్యూరో:



ఇష్టంతోనే పోలీసు వృత్తిలోకి వచ్చానని, ఈ సేవలో పనిచేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తోందని వనపర్తి జిల్లా ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జే. వెంకట నరసింహ గుప్త తెలిపారు.  కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన గుప్త 1990 ఆగస్టు 16న కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని తాడూరు, బొంరాస్‌పేట, నాగర్‌కర్నూల్, ఆత్మకూర్, ధరూర్, గద్వాల్ రూరల్, ఐజ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ విశాల అనుభవాన్ని సంపాదించారు.  22 ఏళ్ల వయసులో ప్రారంభమైన పోలీస్ సేవా ప్రయాణం, ఇప్పటికీ 36 ఏళ్లుగా కొనసాగుతుండగా, 2029 మార్చిలో పదవీ విరమణ పొందనున్నారు. పోలీస్ విధుల్లో ఎన్నో సవాళ్లు ఎదురైనా ఎప్పుడూ ధైర్యంగా ముందుకు సాగానని గుప్త పేర్కొన్నారు. ముఖ్యంగా మావోయిస్టుల ప్రభావం ఉన్న కాలంలో కూడా విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయడం తనకు గర్వకారణమని కొత్తగా పోలీస్ శాఖలో చేరుతున్న కానిస్టేబుళ్లకు తన అనుభవాన్ని పంచుకుంటూ మార్గదర్శకంగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. సేవే తనకు సంతృప్తి, ప్రజల మన్ననలు తనకు పెద్ద గుర్తింపని హెడ్ కానిస్టేబుల్ గుప్త ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పాంగిడిగూడలో పోలీసుల అవగాహన కార్యక్రమం



కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, సురక్ష ప్రతినిధి:

సిర్పూర్-యు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాంగిడిగూడ గ్రామంలో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశమై సైబర్ నేరాలు, గుడుంబా, గంజాయి, రోడ్డు భద్రత తదితర అంశాలపై వివరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గుడుంబా తయారీ, విక్రయాలు నేరమని, ఇందులో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



# ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్




## క్వార్టర్ ఫైనల్స్ ఫలితాలు

హైదరాబాద్‌లో జరుగుతున్న 74వ బి.ఎన్. ముల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (మెన్ & ఉమెన్) - 2026 పోటీలలో భాగంగా ఈ రోజు (03.04.2026) క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ సందర్భంగా జరిగిన మ్యాచ్‌లలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (CISF) జట్టు అస్సాం జట్టుపై అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఒడిశా జట్టు ఐటిబిపి (ITBP) పై ఆధిపత్యం చాటుతూ గెలుపొందింది. గోవా జట్టు సీఆర్‌పీఎఫ్ (CRPF) పై స్వల్ప తేడాతో విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. అలాగే కేరళ జట్టు సిక్కిం జట్టును ఓడించి తదుపరి దశకు చేరుకుంది. ఈ మ్యాచ్‌లు శ్రీనిధి ఎఫ్‌సీ గ్రౌండ్ మరియు నేషనల్ పోలీస్ అకాడమీ (NPA) మైదానాల్లో నిర్వహించబడ్డాయి.

పోటీల్లో పాల్గొన్న జట్లు అత్యుత్తమ క్రీడాస్ఫూర్తితో ఆడుతూ ప్రేక్షకులను అలరించాయి.

సెమీ ఫైనల్‌కు అర్హత సాధించిన జట్లు తదుపరి దశలో పోటీ పడనున్నాయి. ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా వివిధ పోలీస్ బలగాల మధ్య క్రీడా స్ఫూర్తి, ఐక్యత మరింత బలపడుతోంది.




**74వ బి.ఎన్. ముల్లిక్ స్మారక ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (పురుషులు & మహిళలు) 2025–26 హైదరాబాద్, తెలంగాణ**





### 04.04.2026 పురుషుల సెమీఫైనల్ మ్యాచ్‌ల షెడ్యూల్

| | | |
|---|---|---|
| CISF vs ఒడిశా | శ్రీనిధి ఎఫ్‌సీ గ్రౌండ్ | మధ్యాహ్నం 3:00 గంటలకు |
| గోవా vs కేరళ | నేషనల్ పోలీస్ అకాడమీ గ్రౌండ్క | మధ్యాహ్నం 3:00 గంటలకు |

### మహిళల మ్యాచ్‌లు (హార్డ్‌లైన్ & ఫైనల్) తేదీ: 04.04.2026

| | | |
|---|---|---|
| CISF vs SSB | హైదరాబాద్ ఎఫ్‌సీ గ్రౌండ్ | ఉదయం 7:30 గంటలకు |
| అస్సాం రైఫిల్స్ vs ఒడిశా (ఫైనల్ మ్యాచ్) | హైదరాబాద్ ఎఫ్‌సీ గ్రౌండ్ | మధ్యాహ్నం 3:00 గంటలకు |

# భద్రత కోసం బలంగా ఒక్కటైన గ్రామాలు

**రోడ్డుభద్రత, గ్రామ రక్షణ మరియు గంజాయి నిర్మూలనకు కృషి చేస్తూ పోలీసు వారికి సహకరిస్తున్న గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు జిల్లా పోలీస్ శాఖ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు**

**"ఈరోజు మీరు తీసుకున్న తీర్మానం చరిత్రలో నిలిచిపోతుంది"*- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ .**





*మహబూబాబాద్ జిల్లా సురక్ష ప్రతినిధి :*

గత రెండు వారాల క్రితం మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు మరియు మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ గారు రోడ్డు భద్రత, ప్రతి గ్రామం/వార్డు సీసీ కెమెరాల పర్యవేక్షణ మరియు గ్రామాలు, వార్డుల్లో గంజాయి నిర్మూలనపై దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ముందస్తుగా మహబూబాబాద్ జిల్లా పరిధిలో ప్రతి మున్సిపాలిటీలో 3 వార్డులు, ప్రతి మండలంలో రెండు గ్రామాలను మొత్తం 42 గ్రామపంచాయతీలు, 13 మున్సిపల్ వార్డులను ఎంపిక చేసుకుని "మన గ్రామం – మన బాధ్యత" అనే నినాదంతో గ్రామ సర్పంచులు, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది కలిసి గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా సీఐ, ఎస్ఐ స్థాయి నుండి సిబ్బంది వరకు గ్రామాల వీధి వీధి తిరిగి డోర్ టు డోర్ సర్వే నిర్వహించి ఎన్ని హెల్మెట్లు ఉన్నాయో, ఎంత మంది వాడుతున్నారో గుర్తించి, హెల్మెట్ లేని వారికి పంపిణీ చేస్తున్నారు. ఏప్రిల్ 2వ తేదీ నుండి హెల్మెట్ లేకుండా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లోకి ప్రవేశం ఉండదని తీర్మానాలు చేస్తున్నారు. "సీసీ కెమెరాల పర్యవేక్షణలో మన గ్రామం" అనే ఆలోచనతో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ముందడుగు వేస్తున్నారు. అదే విధంగా గ్రామాలు, వార్డుల్లో గంజాయి నిర్మూలనకు కృషి చేస్తూ, గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించి వారిలో మార్పు తీసుకురావడానికి పునరావాస కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ గారి సూచనల మేరకు గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకారం అందిస్తూ ఈ కార్యక్రమాలను బలోపేతం చేస్తున్నారు.




**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ గారు మాట్లాడుతూ**

గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు పోలీస్ శాఖతో కలిసి బాధ్యతగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకుపోవాలని కోరారు. హెల్మెట్ ధరించడం ద్వారా ఒక ప్రాణం కాపాడటం అంటే ఒక కుటుంబాన్ని కాపాడినట్టేనని తెలిపారు. అదే విధంగా సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా గ్రామాల్లో నేరాలను అరికట్టవచ్చని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు గ్రామాల్లో స్థానం లేదని సర్పంచులు, వార్డు సభ్యులు తీసుకున్న సంకల్పం అభినందనీయమని అన్నారు. గ్రామ భద్రతను తమ బాధ్యతగా తీసుకుని పనిచేయడం చాలా గొప్ప విషయమని ప్రశంసించారు. పోలీస్ శాఖకు అండగా నిలిచి, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, యువత భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ప్రతి సర్పంచ్, వార్డు సభ్యులు అభినందనీయులు. రేపటి తరాలకు సురక్షితమైన, మాదకద్రవ్య రహిత




సమాజాన్ని అందించడానికి మనందరం కలిసికట్టుగా ముందుకు సాగాలి అని పేర్కొన్నారు.

పోలీస్ శాఖ తరఫున గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి సహకారంతో ఈ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని ఆకాంక్షించారు. అలాగే ఈ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో ముందుకు తీసుకువెళ్లడంలో సీఐలు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది చూపుతున్న కృషి, నిబద్ధత అభినందనీయమని కొనియాడారు.

ప్రజలందరూ ఈ నిర్ణయాలను తప్పనిసరిగా పాటించి, హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా పోలీస్ శాఖ తరఫున జిల్లా ఎస్పీ డా. శబరీష్ విజ్ఞప్తి చేశారు.

ముఖ్యంగా ఈ కార్యక్రమాలలో పాల్గొని గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లలకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ గారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామంలో "మన గ్రామం – మన బాధ్యత" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ పాల్గొని గ్రామస్తులతో మమేకమయ్యారు. రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా గ్రామ భద్రత, అలాగే గంజాయి నిర్మూలనపై గ్రామస్తులకు సమగ్ర అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.











ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, "మీ పిల్లలు ఎవరైనా గంజాయి సేవిస్తున్నారనే అనుమానం వచ్చిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి. వారికి రిహాబిలిటేషన్ ద్వారా ఆ అలవాటును మాన్పించేందుకు మేము ప్రయత్నిస్తాము" అని తెలిపారు. గ్రామసభ ద్వారా గ్రామస్థులు తీసుకున్న ముఖ్య నిర్ణయాలను ఎస్పీ గారు కొనియాడారు. గ్రామంలో 100% హెల్మెట్ వినియోగం అమలు చేయడం, గ్రామాన్ని గంజాయి రహిత గ్రామంగా మార్చడం, అలాగే గ్రామాన్ని సీసీటీవీ పర్యవేక్షణలో ఉంచడం వంటి నిర్ణయాలు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. "ఈ తీర్మానం గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది" అని అన్నారు. గ్రామస్తులు తీసుకున్న నిర్ణయాలను అభినందించిన ఎస్పీ గారు, "ఈరోజు మీరు తీసుకున్న తీర్మానం చరిత్రలో నిలిచిపోతుంది. రామన్నగూడెం గ్రామం ఆదర్శ గ్రామంగా నిలుస్తుంది" అని అన్నారు. అనంతరం గ్రామస్తులకు 100 హెల్మెట్లను పంపిణీ చేసి, రోడ్డు భద్రత పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## "హెల్మెట్ మన రక్షణ – మన గ్రామ భద్రత మన చేతుల్లోనే"

## "మన గ్రామం – మన బాధ్యత"














Printed & Published by Sri B. Shivadhar Reddy, IPS., Director General of Police & Chief Editor 'Telangana Suraksha' on behalf of the Police Department, Govt. of Telangana and Printed at 'Caxton' Offset Pvt, Ltd., Red Hills, Lakadikapool, Hyderabad-4 for 'TELANGANA SURAKSHA' Press, D.G.P. Office Compound, Hyderabad-4, & Published at the Office of the Director General of Police, Hyderabad - 4, Executive Editor Dr. M. Ramesh, IPS., Commissioner of Police, Cyberabad.